*గులాబీపూవు ఎంతో అందంగా ఉన్నా, దాని కొమ్మకు ముళ్లు ఉండడం సహజం ... ఆ ముళ్లను తొలగించి, గులాబీని మాత్రమే పూయించాలనుకోవడం వ్యర్థం. చదువు, సంస్కారం కల భార్య గులాబీ అయితే, మనసు నెరగని భర్త పక్కలోని ముల్లు ... పరిస రాలు ముళ్లు.*

రాబోయే రాకాచంద్రుని తలుచుకొని సిగ్గుతో చెంపలు కెంపులీనినట్లు ఆకాశం అరుణరాగ రంజితమయింది. వేసవి సాయంత్రం చల్లని మలయ పవనాలు తెరలుతెరలుగా సాగుతూ ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి. కలకలారావాలు చేస్తూ స్వగృహాలకు చేరుకుంటున్నాయి పక్షులు. ఆ కలకలలాడే గోధూళి వేళ ఆనందంగా స్టేషన్ నుంచి వస్తున్నాను.

'రాజశేఖరాన్ని చూసి చాలా రోజులయింది. [illegible] ఏళ్లే అయింది. అప్పుడు విద్యార్థిదశ. ఇప్పుడో వివాహాలూ అయ్యాయి. ఉద్యోగాల్లోనూ స్థిరపడ్డాం. [illegible] రమ్మని ఎన్ని ఉత్తరాలు వ్రాసినా వెళ్లలేకపోయాను. కనీసం వాడి పెళ్లికయినా వెళదామంటే అమ్మకు జబ్బు చేయడంవల్ల వీలు కాలేదు. ఈవేళకు వాడిని చూడాలని ఉంది [illegible]!' అనుకున్నాను.

'అయ్యగారూ! ఇదే కొత్తపేట్టావుపురం. ఏడ దిగుతారు?' అన్నాడు రిక్షావాడు.

"చూడవోయ్! రాజశేఖరంగారి ఇల్లేదో కనుక్కో. ఇక్కడ ఇళ్లన్నీ ఒక్కలాగే ఉన్నాయి మరి" అన్నాను నేను.

రిక్షా కొంచెం ముందుకు సాగి ఆగింది, ఎవరో చెప్పిన రాజా ఇంటిముందు. రిక్షావాడికి డబ్బులిచ్చి సూట్‌కేస్ పట్టుకొని లోపలికి నడిచేను. పొట్టిగోడల పైనుంచి గుట్టగా గులాబీలు నవ్వుతున్నాయి. రకరకాల పూలమొక్కలు అందంగా తలలూపుతున్నాయి రమ్మన్నట్లు. వాటిమధ్య సిమెంటు బాటమీద నడిచి వాకిట్లోకి వెళ్లేను. తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

'రాజా ఉన్నాడో లేదో?' సందేహాలు అరు క్షణంలోనే కలుగుతాయి. 'ఉండకేం వస్తాడులే! ఒకవేళ షైరు వెళ్లినా కాసేపట్లో రాకపోతాడా?' మళ్లీ ధైర్యం పుంజుకొని మెల్లిగా తలుపు తోశాను.

పరిశుభ్రంగా ఉన్న ఆ హాలులో స్టూలుమీద నిల్చుని గోడకు మేకు కొట్టలేక సతమతమౌతున్న దొక యువతి. లేత గులాబిరంగు దుస్తుల్లో నాజూకుగా ఒరిగిపోయి ముందుకు పడే రెండు జడలను వెనక్కు తోసుకొంటూ, అందంగా చిత్రీకరించబడిన రాధా మాధవుల చిత్రాన్ని గోడకు అలంకరించాలని విఫల యత్నం చేస్తున్నది.

మర్యాద కాదని తలుపు శబ్దం చేశాను. వెనక్కు తిరిగిందామె. చామనచాయయైనా కళతో దీపించే అంద మైన ముఖం. చిరుచెమటతో తడిసి ఫాలభాగాన అతుక్కొన్న ముంగురులను అందమైన వేళ్లతో సుతారంగా తోస్తూ స్టూలు దిగిందామె "ఎవరదీ?" అంటూ.

సంభ్రమంతో అపరిచితుణ్ణి నన్ను చూసి ఆమే అడిగింది, "ఎవరు కావాలండీ?" అని.

సూట్‌కేసుని చేతులు మార్చి పట్టుకొంటూ అడిగేను: "రాజశేఖరం లేడాండీ?"

నా మాట వింటూనే చేతిలో సూట్‌కేసుని [illegible]. "రండి, రండి! ఇదో ఇప్పుడే వచ్చేస్తారు. లోపలకు రండి!" అంటూ ఇంటిలోకి నడిచిందామె.

'ఎవరో చుట్టాలనుకొంది కాబోలు ఈవిడ!' అనుకున్నాను.

చల్లని నిమ్మరసం గ్లాసు ట్రేతో నా ముందుంచి సూట్‌కేసు లోపలకు పట్టుకెళ్లిందామె. 'చిన్న అమ్మాయే' అనుకున్నాను పానీయం సేవిస్తూ.

"స్నానం చేస్తారా?" నా సమాధానం వినకుండానే మృదుస్వరాన "రండి! బాత్‌రూమ్‌లో నీళ్లు పెట్టేశాను. సోప్, టవల్సూ అక్కడే ఉన్నాయి." అన్న దామె. బాత్‌రూమ్ పక్కనే మరొక బాత్‌రూమ్ చూసి 'పక్క పోర్షన్లో ఎవరో ఉన్నారు కాబోలు' అనుకుంటూ స్నానం ముగించాను.

తిరిగ్గా సోఫాలో కూర్చున్నాక నాలుగైదు మాగజైన్లు నాముందుంచి లోపల పనేదో చూసుకుంటున్న దామె. హాలంతా కలయచూశాను. అందమైన ప్రకృతి చిత్రాలు, ఒక శకుంతల చిత్రం నన్నాకర్షించేయి. అన్నింటిలో లావణ్య అనే పేరు కన్పించింది. మేకు కొట్టలేక అలంకరించడం ఆపివేసిన ఆ బొమ్మ గుర్తువచ్చింది. స్టూల్‌మీదనే ఉన్న ఆ చిత్రాన్ని చూస్తూండిపోయాను.

వంశీమోహనుడి మోహనమురళీగానలోలయై మధుర భక్తిపూరితమై ఉన్న రాధ! పరవశయై తరగలతో మధురంగా లయ వేస్తూ పరుగులిడే యమున! అందమైన ఆ చిత్రానికి మరింత నేత్రానందం కల్గించేలా ఆకర్షణీయంగా రంగులు వేసిం దామె.

"ఆ బొమ్మ చూస్తున్నారా? నేనే వేశాను!" అన్న దామె అప్పుడే అక్కడకు వచ్చి.

"చాలా బాగున్నదండీ! అయితే మీ పేరు. . ." ఆగిపోయేను.

"లావణ్య." మృదువుగా అన్న దామె.

"నా పేరు రాధాకృష్ణ. రాజా, నేనూ బాల్యమిత్రులం. జీవితంలో ఎందరో పరిచయమౌతారు. స్నేహితులవు తారు. కాని బాల్యమిత్రుణ్ణి కలుసుకొంటున్నప్పుడున్న ఆనందం మరొకర్ని కలుసుకొంటూంటే ఉండదేమో అనిపిస్తున్నది" నాలోని ఆనందాన్ని మాటల్లో ఆమెకు చెప్పేశాక ఏదో తృప్తిగా అనిపించింది.

మెరిసే కళ్లతో స్నేహపూర్వకంగా నవ్వి అన్న దామె: "అయితే కుచేలుడిని కలుసుకోవడానికి శ్రీకృష్ణుడే స్వయంగా వచ్చేరన్నమాట!"

"అదేం? అలా అంటున్నారూ?" అన్నాను రాజుని కుచేలుడితో పోల్చినందుకు ఆశ్చర్యంగా.

"భలేవారే! స్నేహితుణ్ణి కుచేలుడితో పోలిస్తేనే అలాగయిపోయారే! నిజంగా ఆయన స్నేహానికి కుచేలుడే కాతారు కదా! మీ కున్నంత ప్రేమే ఆయనకుంటే ఆయనే ముందు వచ్చి మిమ్మల్ని చూడాలి" అం దామె తన మాటను సమర్థించు కొంటూ. నవ్వేను నేను.

"ఎన్నాళ్ల నుండో ప్రయత్నిస్తే ఈనాటికి తీరిక దొరికిందండీ! రాజుని చూసి అయిదారేళ్లయింది మీ పెళ్లికికూడా రాలేకపోయాను. . . అప్పుడే అమ్మకు జబ్బుచేసి. . ."

"ఫర్వాలేదండీ!" అన్నది లావణ్య.

కాసేపు మాటలు కరువయ్యాయి. లైట్ స్విచ్ వేసి మాంగల్యాన్ని కళ్లకద్దుకొన్న దామె.

"రాజా ఎప్పుడొస్తాడండీ?"

"ఈపాటికి రావలసింది. ఎందుకో లేటయింది. వచ్చేస్తారు, కూర్చోండి!"

బయట వరండాలోకి నడిచేను. నావెంట వచ్చి గార్డెన్లో చెయిర్ వేసిం దామె.

"అక్కడెంత ఫేన్ వేసుకున్నా బాగా ఉక్కగా ఉంటుంది. ఎండాకాలం కదూ! ఇక్కడ కూర్చోండి!" కలుపుగోలుగా మాట్లాడుతూ ఉందామె. తోటను పరిశీలిస్తూ ఉంటే అన్న దామె: "ఈ మొక్కలన్నీ నేనే వేశానండీ!"

"చాలా బాగుంది మీ పూదోట. మీ శ్రద్ధ ప్రతి పువ్వు పరిమళంలోనూ ప్రతిఫలిస్తూనే ఉంది" అన్నాను నేను.

పువ్వులన్నా, పసిపాప నవ్వులన్నా ఇష్టంలేనివా రుండటం అరుదు కదా! ఆ తోటను చూస్తూ నిల్చుండిపోయాను చాలాసేపు.

కుర్చీవైపు చూస్తూ "కూర్చోండి" అన్నది లావణ్య. ఆమె నిల్చునే ఉన్నందున నేను కూర్చోలేదు. ఆమె గ్రహించి మరో చెయిర్ తెచ్చి పొరబాటున ఒక గులాబిమొక్కపై వేసింది చూసుకోకుండా. అంతలోనే చూసి, వంగిపోయిన గులాబికొమ్మను పైకెత్తి రేపు పూయబోయే జంట గులాబిమొగ్గలను చూస్తూ కళ్ల నీరు నింపుకొంది లావణ్య. ఎంతసేపో ఆ కొమ్మను బాధగా చూస్తూ నిల్చుండిపోయింది.

'పాపిష్ఠి చేతులు నావి!' తనను తానే నిందించు కొంటూ వంగి విరగనున్న కొమ్మను గులాబిగుబురుకు ఆన్చి నిలబెట్టి పదేపదే మొగ్గలను సవరించి ప్రేమతో కొమ్మను వేళ్లతో రాస్తున్న ఆమెను చూస్తూంటే శకుంతల గుర్తు వచ్చింది.

మొక్కలతోపాటే పెరిగిన శకుంతలకు వాటిపై సహజన్ములమీద ఉండే అనురాగం ఉన్నట్లే, స్వహస్తాలతో పెంచిన ఈ మొక్కలపై మాతృప్రేమ ఉన్నదేమో ఈమెకు!

అవ్యక్తమయిన బాధతో స్వేదపూరితమైన ముఖాన్ని మునివేళ్లతో తుడుచుకొన్న దామె. సన్నటి పొడవైన వేళ్లు, కొనలు తీర్చిన గోళ్లు ఆమె చిత్రకారిణి అని చెప్పకనే చెబుతున్నాయి. లావణ్య! పేరుకు తగినట్టే లావణ్యవతి.

కాసేపటికి నా ఉనికిని గమనించి ఆమె తేరుకున్నది. లావణ్యను మరిపించటానికి ఏవేవో విషయాలు చెబుతూంటే వింటూ ఆ విషయాన్ని మరిచిం దామె. ప్రసంగవశాన అడిగేను: "మీరేం చదువుకొన్నారు?"

"బియ్యే పాసయ్యానండీ సెకండ్ క్లాస్‌లో! యమ్మే చదువుతానంటే వద్దనేశారు అమ్మా, నాన్నా! ఈయన

## కుమారి లలితా మన్నెమ్



# విరిగిన కొమ్మకు విరిసిన పూలు

"బాబా!" కొత్త కంఠంతో ఆమె మాట్లాడుతుంటే వింటున్నాను. తొమ్మిదయింది. ప్రయాణపు బడలిక వల్ల కాబోలు ఆవలిస్తుంటే చూసి, "అరరే! మిమ్మల్ని ఎంతసేపు ఉంచేశాను! ఆయన కోప్పడతారుకూడా! రండి, భోజనానికి" అంటూ లేచిం దామె.

ఆమె వడ్డిస్తుంటే భోజనం ముగించాను. ఇంతలో [illegible] పదేళ్ల కుర్రాడు వచ్చాడు. ఏదో చీటీ ఆమె కిచ్చి చదివి దిగులుగా కాసేపు ముఖం పెట్టుకొని, "సరే, వెళ్లు!" అన్నదామె. ఏదో కర్తవ్యం తోచినట్లు "నిద్ర వస్తున్నట్లుంది మీకు. ఆ గదిలో పక్క వేశాను! పడుకోండి" అన్నది వంటగది శుభ్రపరచడానికి వెళుతూ.

నిశాదేవి పంపిన రాయబారిలా నిద్రాదేవి నా చేయి పట్టుకొని లాక్కుపోయిం దా గదిలోకి.

మరునాటి [illegible] స్నానం ముగించుకొని [illegible] చిన్నపాప ఏడుపు వినిపించింది. అకస్మాత్తుగా గుర్తు వచ్చింది సూట్‌కేస్‌లో అడుగున పెట్టిన గౌను పాకెట్. "రాజుకి ఒక పాప ఉండాలే? ఏమయిందబ్బా! ఒక వేళ. . .' అశుభం ఊహించడానికి మనసు అంగీకరించలేదు. 'ఆఁ! అమ్మమ్మగారింట్లో పెరుగుతున్నదేమో? అయినా అడిగితే అదే తెలిసిపోతుంది"

లావణ్య టిఫినూ కాఫీ ట్రేలో పెట్టుకొని వచ్చింది.

"ఏమండీ!" వెళ్ళబోతూ వెనక్కు చూసిందామె.

"మీ పాప ఏదండీ?" నా ప్రశ్నలో ఏం విడ్డూరముందో కళ్లార్పకుండా చూసిం దామె చాలా సేపు. ఒకవేళ పాప కేమైనా అయిందేమో? ఛ! అడిగి ఆవిడని బాధపెట్టనే? అడక్కపోయినా బాగుండేది.

తప్పు చేసినవాడిలా తల వంచుకొన్నాను.

కాసేపటికి తేరుకొని నవ్వుతూ అన్న దామె: "పక్కింటి పాపండీ, ఇప్పు డేడ్చింది!"

"అది కాదండి! మీ పాప సంగతండీ నే నడిగేది!" అన్నాను.

"మా పాపా!" మళ్లీ ఆశ్చర్యపోయిం దామె ప్రబంధ నాయికలు అస్తమానూ మూర్ఛపోయినట్లు.

"మాకు పాపలు లేరే! బాబులుకూడా లేరు!" స్థిరంగా అన్న దామె మరొక సంశయానికి తావివ్వకుండా.

"మరి రాజు వ్రాశాడే! పాపకు మాధురి అని పేరు పెట్టామనికూడా వ్రాశాడు" అన్నాను ఆశ్చర్యపోతున్న ఆమెను చూసి.

ఆలోచిస్తున్న ఆమె చటుక్కున ఏదో స్ఫురించి నట్లు అన్నది: "ఏమండీ! మీ ఫ్రెండ్ రాజశేఖరంగారి ఇంటిపేరు ఎస్. కదూ!"

ఔనన్నాను నేను.

"పాప మాధురి నాన్నగారు రాజశేఖరం పక్కనే ఉంటున్నారు. అవతల పోర్షనే! మా మిస్టర్ పేరూ రాజశేఖరమే! యస్. ఆర్. శేఖరమన్నమాట!"

నేను స్థాణువులా నిల్చుండిపోయాను. ఒక్క క్షణంలో ఆశ్చర్యం, ఆవేదన, పశ్చాత్తాపము ముప్పిరిగొన్నాయి నాలో. అవ్యక్తంగా ఉండిపోయిన నా బాధ అర్థం చేసుకొన్న దామె. "ఛఛ! ఎంత పని జరిగింది!" తప్పు చేసినవాడిలాకాక తప్పు చేసే ఆమె ఎదట నిల్చున్నాను!

సహృదయురా లామె. అర్థం చేసుకొంది నాలోని భావశబలత! "మీరేమీ బాధపడకండి. ఏముంది ఇందులో? మీరుమాత్రం అనుకోగలరా ఇద్దరు ఒకే పేరుగల వ్యక్తులు ఒకే ఇంట్లో రెండు భాగాలలో అద్దె కుండగలరని? చాలాసార్లు లెటర్స్‌కూడా ఇలాగే తారుమారై వస్తుంటాయి మాకు. భలేవారే! అదేమిటండీ! దోవ తప్పి మీ ఇంటికే వస్తే మాలాటి వాళ్లను ఆదరించరా ఏమిటి?" అంది ఆమె.

బాధా మలినమయిన నా హృదయాన్ని పన్నీటివానలా ఆమె మాటలు కడిగివేశాయి. నిష్కల్మష హృదయురాలు!

• • •

ఆమె (లావణ్య) వేసిన పూలదారులవెంట మరొక బాట ఉన్నది పక్క పోర్షన్‌కు. చూడటానికి ఒకటే ఇల్లు. ముందు వెళ్లగానే వచ్చే వరండాతో కలిసి ఉన్న భాగం లావణ్యగారిది. ఆ వరండాను ఆనుకొనిఉన్న గది తలుపు మూసి ఉంది. అవతలి పక్క తెరిచిఉన్న ఆ భాగం రాజుది.

పశ్చాత్తాపంతో తల వంచి రాజు ఇంటివైపు నడిచాను. ఈజీచెయిర్లో పడుకొని ఏదో ఆలోచిస్తున్నాడు రాజు. వాడిని చూసి నాకుగాని, నన్ను చూసి వాడికిగాని నే ననుకొన్నంత, నేను అన్నంత ఆనందం ఏమీ కలగలేదు.

"అరే, రాధా!" అన్నాడు పైకి లేచి. ఏదో బాధ ధ్వనించింది ఆ కంఠంలో. నీరసంగా కూర్చుండి పోయాను వాడు వేసే ప్రశ్నలకు సమాధానాలిస్తూ.

భార్య విజయలక్ష్మిని, పాప మాధురిని పరిచయం చేశాడు. ఆ రోజుకి సెలవు పెట్టి, నాతో గడిపేశాడు ఊరంతా చూపిస్తూ. ఆ తిరగడంలో కొంచెం మరిచిపోయాను పొద్దుటి ఆవేదన.

రాత్రి భోజనాలయ్యాక నా పడక అమర్చిన గది చూపించి, "అలసిపోయావ్‌రా తిరిగి తిరిగీ! విశ్రమించు" అన్నాడు నవ్వుతూ. అలసటతో మేను వాల్చేసరికి నిద్ర ముంచుకువచ్చింది. సరిగ్గా గోడ గడియారం పన్నెండో సారి తక్కున కొట్టేసరికి పొగమంచులా విడిపోయింది నిద్రమత్తు. క్రమంగా పక్కగదిలో మాటలు వినబడసాగేయి.

"ఏమండీ! నిన్న ఒక విషయం జరిగిందండీ!" లావణ్య గొంతు వినిపించింది.

"విషయాలకేం! బాగానే సేకరిస్తావు. ఇంట్లో ఉన్నట్టు పేరు! ఊళ్లో విషయాలన్నీ నీ స్వంతం!"

"నే నెక్కడికీ వెళ్లలేదండీ! నిజంగా! ఒట్టండీ!!" లావణ్య స్వరంలో ఆవేదన ధ్వనించింది. తిరిగి ఆమే అన్నది:

"నిన్న మన ఇంటికి ఒకాయన వచ్చారు!"

"ఆయనా!" ఆ విషపు స్వరానికి నాకే భయం వేసింది. రాజశేఖరమా? ఖరమా!

"ఔనండీ! ఆయనకు రాజశేఖరం అనే ప్రాణస్నేహితుడున్నాడట. మీరే అనుకొని ఎవరో మన ఇల్లు చూపారట! పాపం, ఆయన మీ కోసం ఎంతసేపో చూశారు" అన్న దామె.

"ఏమిటీ?"

"చెప్పనీయండి! నిజంగా మీ స్నేహితుడే ననుకొని నేను ఆయనను ఉండమన్నాను."

"లావణ్యా! నేను లేనని తెలిసి, ఎవడు దొరికితే వాడితో కబుర్లేసుకు కూర్చుందామనేగా నీ ఊహ! నీ నీచపు బుద్ధి పోనియ్యలేదు... ఎంతసే పున్నాడేం?"

"ఆయన సూట్‌కేసు తెచ్చుకొంటే ప్రయాణం చేసి వస్తున్నారని లోపలకు రమ్మన్నాను. సరిగ్గా తొమ్మిదింటికి ఆయన మీకోసం చూసి చూసి భోంచేస్తుంటే ఆ కుర్రవాడు మీరు కాంప్ వెళుతున్నా నని వ్రాసి యిచ్చిన చీటీ ఇచ్చాడు. ఇక అప్పు డాయనను ఎక్కడకు పొమ్మనేది? తెల్లవారేకా మాటల సందర్భంలో తేలింది ఆయన ఫ్రెండ్ మరో రాజశేఖరమని."

"అయితే ఏమిటీ, రాత్రంతా ఉన్నాడా అతను?"

"ఔను." మెల్లిగా అం దామె.

"ఎంత నంగనాచిలా మాట్లాడుతావు? వెధవ! షోకిల్లాలా నయగారాలు పోతూ చెబితే నమ్మేస్తాననా? రాత్రి...! నేను లేనప్పుడు! నా స్నేహితుడినని చెప్పుకొన్న ఒక వెధవతో... నువ్వు..."

"ఆపండి."

"ఆపాలా? ఆపనటే దొంగముం..."

లావణ్య మాట మరి వినిపించలేదు. కొడుతున్న చప్పుడు ఆమె పడుతున్న బాధకంటే ఎక్కువగా వినిపిస్తున్నది. నానా దుర్భాషలాడి రాత్రి ఎప్పటికో అతడు శాంతించాడు. నాకు శివరాత్రే అయింది ఆ శేషరాత్రి!

• • •

ఆ రోజు రాజుకి సెలవు దొరకలేదు. ఎక్కడికి వెళ్లినా మధ్యాహ్నం తను భోజనానికి వెళ్లేవేళకు రమ్మని రాజు ఆఫీసుకి వెళ్లిపోయాడు. నాలుగు రోడ్లూ చక్కబెట్టుకొని తిరిగివచ్చేను మధ్యాహ్నం ఒంటి గంటకు. లావణ్య ఇంటికి కిటికీ తలుపులు సహితం మూసి ఉన్నాయి. రాజు ఇంటివైపు వస్తుంటే విజయా, రాజూ ఘర్షణపడుతున్నట్లు వినిపించింది.

విజయ స్వరం చాలా హెచ్చుగా ఉంది. "అవును. నేను వంటమనిషిని. అదేగా మీ ఉద్దేశ్యం? మీకూ, మీ స్నేహితులకూ వండిపెట్టే ఒక వంటలక్కను! నేనూ ఒక మనిషి నని, నాకూ ఒక సరదా, సంతోషమూ ఉండాలని ఎందు కనుకోరు మీరు?"

"విజయా, చూడు. అసంతృప్తి అనేది ఒక మందు లేని వ్యాధి. నీవు వినలేదా, తాడి తన్నేవాడి తలదన్నేవా డుంటాడని. అదే నిజం! ఐశ్వర్యంలో కాని, అందంలోకాని—ఏ విషయంలో అయినా ఒకరిని మించి మరొకరు ఉండనే ఉంటారు." రాజు సౌమ్యంగా అంటున్నాడు.

"చూడు! మన కున్న దానితోనే తృప్తిపడాలి. ఉన్నదానిలోనే సుఖపడాలి."

"సుఖం! తృప్తి! మాటల్లోనేగాని చేతల్లో చూపించ లేని మీకు భార్యెందుకు, పెళ్లెందుకు?"

"నన్ను నేను సహనానికి పరీక్ష పెట్టుకొనేందుకు!" విసుగ్గా అన్నాడు రాజు.


## విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం 'కలర్ ట్రాన్స్‌పరెన్సీ'లు పంపమని ఫోటోగ్రాఫర్లకు విజ్ఞప్తి చేస్తున్నాము.

సైజు $2\frac{1}{4}'' \times 2\frac{1}{4}''$కు తక్కువగా ఉండరాదు. విషయం ఏదైనా పరిశీలించడం జరుగుతుంది. ప్రచురణకు అంగీకరించనివాటిని తిప్పిపంపడంకోసం తగు పోస్టేజితో చిరునామా ఉన్న కవరు జతచేసి పంపాలి. పోస్టులో పంపేటప్పుడు పోయిన వాటికి మా బాధ్యత లేదు. ప్రచురించినవాటికి అమలులో ఉన్న మా రేట్ల ననుసరించి పారితోషికం ఇవ్వడం జరుగుతుంది.

ఈ అవకాశాన్ని ఫోటోగ్రాఫర్లు వినియోగించుకొని మాతో సహకరించగలరని ఆశిస్తున్నాము.

—ఎడిటర్




"ఆహా! పహనం! పాపం, సహనంతో ఓ రోజు కొక స్నేహితుణ్ణి తీసుకొచ్చి వండి పెడుతున్నారు! పాపం, అటు ఆఫీసూ, ఇటు వంటా . . . ఇదిగో, ఇప్పుడే చెబుతున్నాను. ఈ విజయలక్ష్మి మాటంటే మాటే! సాయంత్రం బండికే నే వెళ్ళిపోయేది. . ."

కాసేపు వెనక్కి తిరిగి పొలాలవైపు తిరిగి వచ్చేను. రాజు ఎదురువచ్చి, "రారా! భోంచేద్దాం" అన్నాడు. భోంచేశాక "సాయంత్రం కేంపుకి వెళ్ళాలేమో!" అన్నాడు. గ్రహించి "నేను సాయంత్రం వెళ్ళిపోతాగా" అన్నాను. ఉండమని అనలేదు వాడు.

* * *

"స్వైరిణి అన్నారు నన్ను, క్షామమండరా!" సన్నగా ఆలాపన వినిపించింది. చటుక్కున నా కాళ్ళు ఆగిపోయేయి. కర్టెన్లు గాలి కెగరగానే నావైపు అప్పుడే చూసి పరుగెత్తుకొచ్చింది పసిపాపలా లావణ్య.

"వెళ్ళిపోతున్నారా?" పసిపాపలా అడిగిం దామె. నిన్న ఆమెకు జరిగిన అవమానానికి నా హృదయం దహించుకుపోయింది.

"మీ ఆతిథ్యానికి కృతజ్ఞుణ్ణి. కాని. . . ప్రతిఫలం. . ."

"ప్రతిఫలం ఇవ్వాలనుకుంటున్నారా?" అందామె బరువుగా.

"అది కాదండి. క్షమించాలి ... నిన్న మీరు నాకు ఆతిథ్యం ఇచ్చినందువల్ల జరిగిన ప్రతిఫలం తెలిసే నేను బాధపడేది. . ." క్షణంలో ఆమె ముఖం రంగులు మారింది. వర్షించే మేఘావళి అయ్యాయామె కళ్ళు. ఆ విశాల నయనాలలో కన్నీటిని దాచుకోవాలని ప్రయత్నంకూడా చేయలే దామె.

"నా కీ విషయం తెలిసిందని మీరు బాధపడుతున్నారు. కాని మీరు ఆయన కర్కశత్వానికి గురి అయ్యారని నేను పడే బాధ భగవంతుడికే తెలుసు! ఆయన. . ."

"ఆపండి! ఆపండి!" ఆవేదనతో అరిచిం దామె. కన్నీరు పద్మనాళంలా బుగ్గలపై జారింది. అదిరే పెదవుల్ని పంటితో అదిమిపట్టి చాలాసేపు తోటవైపు చూస్తూ నిల్చుండిపోయిం దామె. కళ్ళు ఆవేశంతో మెరిశాయి.

"చూడండి! అటు చూడండి!" ఆవేశంగా అరిచిం దామె. నా సమాధానానికి ఎదురుచూడకుండానే అన్న దామె! "చూడండి! మొన్న విరిగిపోయిన కొమ్మ నిలబెట్టినందుకే నిన్న విరగబూసింది! నేడూ నిలచి ఉన్నది. ఆ గులాబి ఎంత బాగున్నది? కాని . . . ఆ ముళ్ళకొమ్మో? ముళ్ళకొమ్మ బాగా లేదని ఆ గులాబిని తెంపి మరొక కొమ్మకు చేర్చండి. అది బతకలేదు. అది బతకదు! కొమ్మ ముళ్ళదైనా దాని కదే ఆధారం! ఆ ఆధారాన్ని కాదని దాన్ని కూలదోస్తారా? దాన్ని కాల రాస్తారా? గులాబికి ముళ్ళకొమ్మే ఆధారం! దానిని శిరసున ధరించి పూజించినా, అది స్థానం తప్పితే కుసుమించదు. కాని. . . కాని. . . ఎలాగూ విరిగి పోతుంది కదా అని ఆ మొగ్గలు తెంపి మరొక అందమయిన కొమ్మకు అంటుకట్టకండి! అప్పు డది విఫల ప్రయత్నమే అవుతుంది. మీ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే అవుతాయి. అంతే! అంతే!" అరిచిం దామె ఆవేశంతో. పరుగెత్తుకు లోపలికి వెళ్ళిపోయింది తటిల్లతలా!

* * *

ఎంత చక్కగా చెప్పిం దామె! అవును. హిందూ సమాజంలో భర్త అనురాగం కొరతయినా స్త్రీ బతకలేదు. భార్య ఆదరణ పొందలేని భర్త నిలవలేడు. ఆ ఇద్దరూ పూవూ కొమ్మా, పూవూ తావి! వాటి నెవరూ విడదీయరాదు.

స్టేషన్‌లో రాజు కనిపిస్తే మరింతఆశ్చర్యపోయాను. "కేంపుకి వెళ్ళడంలేదురా!" అన్నాడు. ఎందుకో నాకు తెలుసుగా!

ట్రెయిన్ కదిలింది. కిటికీలోంచి ఆకాశాన్ని చూశాను.

అహంభావియైన భర్తకు అణగిపోయిన సాధ్విలా, గయ్యాళి భార్యతో సర్దుకుపోయే భర్తలా సాయం సంధ్య ఉదయపు అరుణిమను, రాత్రి నలుపును పులుముకొంటూ నవ్వినట్లైంది!

నేనూ నవ్వుకొన్నాను. కళ్ళ ఎదుట దృశ్యం విరిగిన కొమ్మకు విరిసిన పూలు! ★

# ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ముఖ్య గమనిక

మాకు పంపే వ్యాసాలు, కథలు, చిత్రాలు వగైరాలతోపాటు తగినన్ని స్టాంపులు అంటించి, తమ అడ్రసు వ్రాసిన కవరు పంపాలి. అలాంటప్పుడే ప్రచురించలేనివాటిని వెనక్కి పంపడం జరుగుతుంది.

ఆమోదించినవాటి విషయం వారికి తెలియపరుస్తాము.

స్టాంపులతోడి కవర్లు పంపకుండా తర్వాత వాటి విషయమై ఉత్తరాలు వ్రాస్తే ప్రయోజనంలేదు.

—ఎడిటర్